# అట్టడుగు

నేను స్వతహాగా బంధుప్రియుణ్ణి కానుగాని, ఏడెనిమిదేళ్లు బంధువులందరికి ఎడమైపోయి, దేశంకాని దేశంలో ఉండటం మూలాన కొంత బంధుప్రేమ నాలో కూడుకుంది. అందుచేత రాములు రాసిన ఉత్తరం చేతికందగానే ఎంతో ఆత్రంగా చించి చదవసాగాను.

పన్నెండు పేజీల ఉత్తరం రాశాడు రాములు. ఆ కాగితాలబొత్తి చూడగానే నాకు నవ్వొచ్చింది. రాములు మారలేదు. ఒకప్పుడు వాడూ నేనూ చాటభారతాలంత ఉత్తరాలు రాసుకునేవాళ్ళం. ఏం రాసేవాళ్ళమో నాకిప్పుడేమీ తెలీదు. కాని ఆ రోజుల్లో ఆ ఉత్తరాలు మాకిచ్చిన ఆనందం ఏ సాహిత్యమూ ఇచ్చేదికాదు. అయితే నాకు పెద్ద ఉత్తరాలు రాసేశక్తి ఏనాడో పోయింది. స్థల వాతావరణాలు మారగానే నేనూ మారిపోయినాను. ఉన్నచోటే ఉండటం వల్ల రాములు మారలేదు. నేను కాస్త ప్రోత్సాహమిస్తే వాడు ఇవాళ కూడా వారానికో పన్నెండు పేజీల ఉత్తరం రాసిపారెయ్యగలడు.

మనిషి తన అహంకారం కొద్దీ తన స్వయిచ్ఛకు లేని ఆధిక్యం అంటగట్టుకుంటాడు. మానవచరిత్రా, మానవ సంస్థలూ, మానవ ధర్మ చట్టాలుకూడా మానవుడికి లేని శక్తుల్ని అంటగట్టుతున్నాయేమో. తప్పులు చెయ్యటానికీ ఒప్పులు చెయ్యటానికీ, సంఘాన్నీ చరిత్రనీ మార్చటానికీ వ్యక్తులు మనం ఊహించేటంత సమర్థులు కారేమో. మానవ సామాజికశక్తుల్ని నేను శంకించటంలేదు. ఆ శక్తులే లేకపోతే ఇంతగా నాగరికతా సంస్కారాలు పెరగవు. కాని వ్యక్తుల్ని చూసినప్పుడు వాళ్ళకీ, వాతావరణాన్ని బట్టి మారే ఇతర ప్రాణులకీ పెద్ద వ్యత్యాసం కనబడదు. చీడపట్టి చెడిపోయే చెట్లనీ, ఎరువు బాగావేస్తే బాగా పండే పొలాలనీ, ఆహారం చూడగానే తోక ఆడించే కుక్కల్నీ అర్థం చేసుకున్నట్టుగా మనం "తప్పుడు" పనులూ, "మంచి" పనులూ చేసే మనుషుల్ని అర్థం చేసుకోమనిపిస్తుంది. కన్నం వెయ్యటమూ, వెయ్యకపోవటమూ నిర్ణయించుకునే అధికారం దొంగకీ, యుద్ధ రంగంలో చావటమూ, చావకపోవటమూ నిర్ణయించుకునే శక్తి సైనికుడికీ ఉన్నట్టు మనం నటిస్తాం. ఈ నటనమీదే మన సాంఘిక విశ్వాసాలూ, నైతిక ధార్మిక విశ్వాసాలూ ఆధారపడ్డట్టు కనిపిస్తుంది. అన్ని నియమాలూ గాలికి వొదిలేసి అరాచకంగా బతకాలని కూడా నా

అభిప్రాయం కాదు. నేనడిగేదల్లా ఏమిటంటే మనం మనుషుల్ని మార్చటానికి చేసే ప్రయత్నం లోనూ వ్యయంలోనూ సగానికి సగమైనా వాతావరణాన్ని మార్చటానికి ఎందుకు చేయమూ అని; ఎవరన్నా వాతావరణాన్ని మార్చటానికి ప్రయత్నం సాగిస్తే వాళ్ళు దేశద్రోహులనో సంఘ విద్రోహులనో రుజువు చెయ్యటానికి ఎందుకు ప్రయత్నిస్తామూ అని.

## 2

రాములు రాసిన ఉత్తరం ఆత్రంగా చదవసాగాను. ఒక్కొక్క పంక్తి చదువుతున్నకొద్దీ నా ఫుత్సాహం నీరు కారిపోసాగింది. అంత ఉత్తరంలోనూ ఒక్క మంచి వార్త ఉన్నట్టు నా బుద్ధికి తోచలేదు. కాని రాములు ఆ వార్తలన్నీ మామూలు వార్తలల్లేనే రాశాడు.

మా బంధువులు అంతా ఒకదారి అయినారు. యుద్ధం మూలంగా గామాలు కొందరు చాలా దూరం వెళ్ళారు. వాళ్ళందరికన్నా దూరం వెళ్ళిన నన్ను గురించి నాకు జాలి కలగలేదు. కాని వాళ్ళని గురించి చాలా జాలేసింది. కొందరికి పిల్లలు పోయినారు. కొందరికి మొగుళ్ళూ, పెళ్ళాలూ పోయినారు. కొందరు ఆస్తులమ్మేసుకున్నారు. కొందరి పెళ్ళిళ్ళయినై. మరికొందరు కాపరాలకి వెళ్ళారు. చాలామందికి ఇద్దరు ముగ్గురేసి పిల్లలు కూడా కలిగారు. ఎందుచేతో ఈ వార్తలు కూడా నాకు దుర్వార్తలల్లేనే తోచినై.

నేను ఇట్లా ఇవతలికి వచ్చెయ్యగానే మా బంధువుల జీవితమంతా నానా రభసాయినట్టూ, నేను అక్కడే ఉన్నట్టయితే ఇవేవీ జరగనట్టూ నాకు అనిపించింది. అసలు రహస్యమేమంటే, ప్రత్యక్షంగా జరిగే ఏ మార్పునైనా సహించి మనసు సరిపెట్టుకోవచ్చు. కాని పరోక్షంగా జరిగే మార్పుల గురించి మనసు సమాధానపరచుకోవటం చాలా కష్టం. అందుచేతనే మరో దేశంలో జరిగే విప్లవాలూ, మరో వర్గం వాళ్ళు చేసే విప్లవాలూ మనని ఆందోళనపెడతై.

## 3

నిరుత్సాహంగా రాములు రాసిన ఉత్తరం చదువుకుపోసాగాను. అకస్మాత్తుగా నా కళ్ళు నమ్మలేని విషయాలు ఉత్తరంలో కనిపించినై. వాటిని ఒకంతట నా బుద్ధి అవగాహన చేసుకోలేకపోయింది.  ఆ నాలుగు పంక్తులే అరడజనుసార్లయినా చదివి ఉంటాను – యింకోసారి చదివితే అక్షరాలు మారిపోతాయనే ఆశతో. నేను తప్పు చదువుకున్నానేమో అనే భ్రమతో అందులో ఉన్న విషయం గురించి నా తల ఆలోచించకుండా కాస్సేపయినా వాయిదా వేసుకునే ప్రయత్నంలో; కాని ఏం లాభం? ఆ అక్షరాలు మారవు. నేను సరిగానే చదివానని అరడజను సార్లు రుజువయింది. గణపతి బిచ్చమెత్తుతున్నాడనే విషయాన్ని

గురించి ఆలోచించటం అయిదు నిమిషాలు వాయిదా వేశాను; ఇంకెంతసేపు వాయిదా వెయ్యను?

అయినా యింత ఘోరవార్తను గురించి అనుకునేటందుకు మాత్రం ఏముందీ? నేను ఈ దూరదేశంలో ముష్టెత్తి బతుకుతున్నానంటే గణపతి ఏమనుకుంటాడు నేను ఊహించలేనా? యింకా అదేనయం ఇక్కడ నేను ముష్టెత్తినా నన్నడిగే వాడుండడు. వాడు పాపం, పుట్టి పెరిగినచోట మానం వొదిలేసుకుని ముష్టి ఎట్లా ఎత్తుతున్నాడు? ముష్టెత్తటానికి వెనక ఎంత వంశాచారం వుండాలి? ఎంత స్వానుభవం వుండాలి? అదంతా గణపతి కెక్కణ్ణుంచి వస్తుంది? గడవక వాడు ముష్టెత్తినా మిగిలిన మా బంధువులు వాణ్ణెట్లా ముష్టి ఎత్తనిస్తున్నారు?

నాకు అకస్మాత్తుగా రాములు మీద పట్టరాని ఆగ్రహం వచ్చింది. రాములేం చేస్తున్నాడు?

ఎవరుగానీ హేయమైన సంఘటనలు నిర్లిప్తులై ఎట్లా చూస్తారో నాకు తెలీదు. మనం చూస్తూ వుండగా ఎవరన్నా ఎట్లా తిండికి మాడి చస్తారు? జీవితాన్ని గమనించటమే చాతనయి, దాన్ని మార్చటం ఏమాత్రం చాతకానట్టు ప్రవర్తించే వాళ్ళని నేను సహించలేను. "ఇవాళ కలకత్తా వీథుల్లో యింతమంది తిండిలేక చనిపోయినారు" అని ఏ విలేఖరి గాని, ఏ పత్రికకైనా వార్త పంపినట్టు చదవగానే నా రక్తం వుడికిపోయేది. ఈ విలేఖరి అందులో ఒక్కడికైనా తిండి ఎందుకు పెట్టలేకపోయినాడు? ఈ విషయం టెలిగ్రామిచ్చే డబ్బుతో ఒక్కడికైనా యింత గంజినీళ్ళు పొయ్యటానికి సాధ్యం కాదా?

అయినా పొరపాటు నాదేనేమో. ప్రపంచం నిండా విలేఖరులున్నారు. తాము మార్చగల సంఘటనలను సహితం వాళ్ళు పత్రికలకు పంపిస్తారు. సంఘటనలని మార్చటం నేననుకున్నంత సులభం కాదేమో.

రాములు తినటానికింత కలవాడు. గణపతి నా అంత దగ్గిర చుట్టం కూడానూ. "గణపతీ, వాడి భార్యా, పిల్లలూ మాడుతుంటే మాయింటో తెచ్చిపెట్టాను. మా అందరికీ సరిపడే తిండి లేకపోవడం చేత అందరమూ ఒక పూటే తిండితిని మరో పూట పస్తులుంటున్నాము" అని రాములు రాస్తే నాకా వార్త సవ్యంగా తోచివుండేది. పోనీ అంతదాకా వద్దు. "గణపతికి నేను నెలకొక పది పంపుతున్నాను" అని రాములెందుకు రాయలేదో నా కర్థం కాలేదు.

ఈ మాట నాకు తోచగానే వుత్తరం మడిచి జేబులో పెట్టి గణపతి పేర ఇరవై రూపాయలు మనియార్డరు చేశాను.

## 4

ఆఫీసులో ఇరవై రోజుల శలవూ, బాంకులో రెండు వందల రూపాయలూ పేరుకుని ఉన్నై. అవి రెండూ ఖూడాచేసి మావాళ్ళందర్నీ చూసిరావాలని కోరిక పుట్టింది.

బయల్దేరాను.

బంధువుల్ని ఒక్కొక్కరిని చూడటం ఆనందంగానే వున్నది. కాని ఒక్కొక్క ఇంటా ఒక్కొక్క రోజూ, పూటా గడిపి వెళ్ళిపోవటం వట్టి వంచనగా కనబడింది. వాళ్ళ జీవితంలో భాగం పంచుకొనటంలోనే నిజమైన బంధుప్రేమ వుందిగాని, ఇట్లా కొన్ని ఏళ్ళకొకసారి కనిపించి మర్యాద చేయించుకుని దాటిపోవటంలో నిజమైన తృప్తి ఏమాత్రమూ లేదు.

కావలిస్తే నేను వీళ్ళందరితోనూ ఇంకా కొంతకాలం గడపగలను కాని, రాముల్నీ గణపతినీ ఎప్పుడు చూద్దామా అని ఆదుర్దాగా ఉంది.

గణపతిని గురించి ఆలోచించాను. వాడు ఎందునా కాకుండా చెడ్డాడు. వాళ్ళ నాన్న బతికి ఉండగా బాగానే సంపాదించాడు. అంతకంటే బాగా ఖర్చుపెట్టాడు. ఆ రోజుల్లో ఆయనకు అక్కర్లేనిది లేదు. మరి మా వూళ్ళో కాంగ్రెసు ఉద్యమం సహం ఆయన నెత్తిమీదగానే పోయింది. గణపతి స్కూలులో చదువుకుంటుంటే మానిపించి మా ఊళ్ళో పెట్టిన జాతీయ విద్యాలయంలో వాడిచేత నవారు నేయించాడు. ఇంట్లో కూడా రాట్నాలు పెట్టి నూలు తీయించాడు. జాతీయ విద్యాలయం మూలబడి ఆ జాగాలో ఒక పిండిమర, ఒక వడ్రంగపు కార్ఖానా ఏర్పడ్డాక గణపతికి అమరకోశమూ, శబ్ద మంజరీ, పంచకావ్యాలూ చెప్పించాడు.

ఆయన చచ్చిపోగానే గణపతి సంసారం బయటపడింది. ఆయన కొనిపెట్టిన రెండు వందల యాభై గజాల నివేశ స్థలంలో, ఆయన మిగిల్చిపోయిన రెండు వందలలో మిగిలినదాంతో ఒక చిన్న కుటీరం వేసుకున్నాడు. గణపతి తల్లి తన మెడలో వున్న నాలుగు సొమ్ములూ అమ్మింది. దాంతో కాలక్షేపం ఆరంభించారు.

గణపతి ఎట్లాగైనా నెలకో పది రూపాయలు సంపాదింతామని చాలా ప్రయత్నం చేశాడు. కోమటి గుమాస్తాగిరీ చేశాడు. ప్లీడరు వాలంటీరుగా పనిచేశాడు. ఎవరికో పిల్లలకి సంస్కృతం కూడా చెప్పాడు. ఒక నెల సంపాదిస్తే మరొక నెల ఏమీ ఉండేదికాదు. ఆఖరుకి వాడి సమస్య ఒక విధంగా పరిష్కారమయింది. గణపతి తాత తమ్ముడొకాయన చచ్చిపోగా ఆస్తిలో నాలుగెకరాలు వచ్చింది. అది గణపతి జీవితంలో పెద్ద పరిణామం. ఆ రోజుల్లోనే నేను దేశం విడిచి వెళ్ళాను.

మా బంధువులందరిలోకి జీవిత యథార్థాన్ని గుర్తించినవాడు ఆ రోజుల్లో గణపతి

ఒక్కడే. మా మాదిరిగా ఇంగ్లీషు చదువు చదివి కృతక సంస్కారం సంపాదించక పోవడం వల్లనో ఏమో, గణపతి డబ్బు తత్వము, సంఘ తత్వమూ బాగా కనుగొన్నాడు.

"వీడెప్పుడో కమ్యూనిస్టుల్లో చేరిపోతాడురా" అని మేం నవ్వుకునేవాళ్ళం.

అటువంటివాడు ముష్టి ఎత్తుకునే స్థితికి వచ్చాడంటే యీపాటికి కమ్యూనిస్టు అయ్యే ఉంటాడనుకున్నాను. 1937లో కాంగ్రెసు ప్రభుత్వం రాగానే గణపతి నలుగురు పెద్దల్ని చూశాడు. వాళ్ళు చాలా మంచిగానే మాట్లాడారు. కాని వాడికేమీ చెయ్యలేకపోయినారు. కాంగ్రెసు వాడైనంత మాత్రాన ఏం లాభం? గణపతి తండ్రి రాజకీయ వేత్తకాడు. పైగా బతికిలేడు. కాంగ్రెసు నిజమైన రాజకీయంలో దిగగానే రాజకీయ వేత్తలుకాని కాంగ్రెసు వాళ్ళంతా అడుక్కు దిగిపోయినారు. గణపతి అట్టడుక్కే జారిపోయినాడు పాపం.

## 5

నేను మొదట రాములు దగ్గిరికే వెళ్ళాను. తీరా ఊళ్ళోకి వచ్చినాక నేరుగా గణపతి దగ్గిరికి వెళ్ళటానికి గుండె చాలలేదు.

నన్ను చూడగానే రాములు ప్రాణం లేచివచ్చినట్టు మాట్లాడాడు. వాడి ఉత్సాహంలో నేను సహం కూడా చూపలేకపోయినాను.

సాధ్యమైనంత పెందలాడే గణపతి మాట ఎత్తాను.

"గణపతికేంరా? పైలా పచ్చీసుగా ఉంది వాడిపని" అన్నాడు రాములు.

రాములు అట్లా ఎట్లా మాట్లాడగలిగాడో నాకర్థంకాలేదు. వాడేనా మారలేదని నేను అనుకున్నాను? ఎంత పొరపాటు!

"అడుక్కుతినటం నీకు వేళాకోళంగా ఉందా?" అన్నాను.

రాములు ఇంత మొహం చేసుకున్నాడు. పశ్చాత్తాపమనుకున్నాను. నా మాటకు చిన్నబుచ్చుకున్నాడని నాకు తెలియలేదు.

"అడుక్కుతినని దెవరులే" అన్నాడు వాడు అసందర్భంగా.

ఎందుకో నాకు రాములు దగ్గిర ఇక గణపతిని గురించి మాట్లాడబుద్ధి కాలేదు. గణపతిని అడుక్కుతిననిచ్చిన తప్పు తనమీద కూడా అంతో ఇంతో వుందని గుర్తించటం ఇష్టంలేక, రాములు గణపతి పని పైలా పచ్చీసుగా ఉందనీ, అందరూ అడుక్కుతినే వాళ్ళేననీ తన అంతరాత్మను సమాధానపరచుకుంటున్నాడు కాబోలనుకున్నాను.

కాస్సేపు అదీ ఇదీ మాట్లాడి నేను గణపతి ఇంటికి బయలుదేరుతూ రాముల్ని వస్తావా అని అడిగాను. వాడు బయల్దేరడనుకున్నానుగాని నా అంచనా తప్పింది.

ఇద్దరమూ కలిసి గణపతి ఇంటికి బయలుదేరాం.

గణపతి ఇంట్లో లేడు. వాడి తల్లి పదిమందికి సరిపడా వంకాయలూ, తోటకూరా, పచ్చి మిరపకాయలూ, తియ్య కందగడ్డా చుట్టూ పెట్టుకుని కూరలు తరుగుతున్నది. తద్దినమో ఏమో అనుకున్నాను.

"ఏమమ్మా, అత్తయ్యా ఎట్లా ఉన్నారు?" అన్నాను.

"ఎప్పుడొచ్చావురా? రా, కూచో, ఎట్లా ఉన్నాం? ఇట్లాగే ఉన్నాం. గణపతి బియ్యం తేబోయినాడు ఇప్పుడే వస్తాడు" అన్నది గణపతి తల్లి.

"గణపతి ఏదన్నా ఉద్యోగం సంపాదించలేకపోయినాడా?" అన్నాను.

"ఆc, ఏం ఉద్యోగాలు? ఏం వస్తుంది ఉద్యోగాలు చేస్తే? నువు చూడరాదూ? అక్కడెక్కడో ఉండి ఏం సంపాదిస్తున్నావు?"

చూస్తుండగానే గణపతి తల్లి అన్ని కూరలు తరిగి కోడల్ని పిలిచింది. గణపతి పెళ్ళాం దొడ్లోనించి లోపలికి వచ్చి కూరలు తీసుకుని వంట యింట్లోకి పోయింది.

గణపతి భార్య బాగా వొళ్ళు చేసింది. ఆవిడ పట్టుచీర కట్టుకుని వుండటం గమనించాను.

ఈ ఇంట్లో నేనూహించిన వాతావరణం లేదు. ఎందుచేతా? నాకర్థం కాలేదు.

బయట అడుగుల చప్పుడయింది. గణపతి వస్తున్నాడేమో అని వాకిట్లో తొంగి చూశాను. గణపతి కాదు, ఎవరో నడివయస్సు మనిషి. "పిన్నీ రెండు రూపాయల బియ్యం ఇప్పించమ్మా!" అంటూ వచ్చింది.

"అయ్యో, పాపం బియ్యం లేవే!"అన్నది గణపతి తల్లి.

"ఇదుగోనమ్మా డబ్బా" అంటూ ఆ వచ్చిన మనిషి నిష్ఠూరంగా అన్నది.

"కిందటిసారి పట్టుకెళ్ళినదానికో?" అన్నది గణపతి తల్లి.

"రేపిస్తాలే.".

గణపతి తల్లి రెండు రూపాయలూ తీసుకుని లోపలికివెళ్ళి కాస్సేపు బియ్యం చప్పుడుచేసి, ఒక చేటలో కాసిని బియ్యం పోసుకుని వచ్చింది.

"ఏమిటదీ?" అన్నది బియ్యం కోసం వచ్చిన మనిషి దాష్టికంగా.

"చెప్పలా, లేవనీ, రూపాయివి వున్నై, తీసుకుపో."

"అవ్వ! యివి రూపాయివా?"

గణపతి తల్లి మారుమాట లేకుండా చేట తీసుకుని లోపలికి పోతున్నది.

"తే. తే! ఏం చేస్తాం" అంటూ ఆ మనిషి బియ్యం ఒళ్ళో పోసుకుపోయింది.

ఏ వీరేశలింగం గారి ప్రహసనమో చూస్తున్నట్టుగా వుంది నాకు.

మా గణపతి తల్లికి మాత్రం ఇదంతా పరిపాటే గామాలు. ఆవిడ ఏమీ జరగనట్టు

రాములుతో, "అయితే రాములూ, ఆ పదిహేను రూపాయలూ పట్టుకుపోయిన వాడు మళ్ళీ అయిపులేడే?" అన్నది.

"వాడెక్కడికి పోతాడులే. వస్తాడు" అన్నాడు రాములు.

ఒక్కసారి వాడి చూపులూ నా చూపులూ కలిసినై. నేనే మొహం తిప్పుకున్నాను.

కాస్సేపటికి గణపతి వచ్చాడు. వాణ్ణి నేను గుర్తించలేదు, పైన చొక్కాలేదు. మొహాన ఇంత కుంకం బొట్టు, మెళ్ళో రుద్రాక్షలు, పిలకలో ఒక చిన్న నందివర్ధన పువ్వు. మనిషి అతి విచిత్రంగా మారాడు. వాడి చంకలో జోలి బరువుగా ఉంది. ఒక్క ఊపు ఊపి గిర్రున తిప్పి రెండు చేతులతోనూ కింద దింపాడు. జోలెలోనుంచి ఒక బూడిద గుమ్మడికాయ తీశాడు.

"గుమ్మడికాయ తెచ్చాను. వొడియాలు పెట్టండ్రా" అన్నాడు గణపతి. ఆ తరువాత నాకేసి తిరిగి "ఎప్పుడొచ్చా?" అన్నాడు.

"ఇప్పుడే" అన్నాను.

"ఏమే. ఇది లోపలికి పట్టుకెళ్లూ?.... కులాసా?" అన్నాడు మళ్ళీ.

"ఉన్నానిట్లా?" అన్నాను.

"వెంకట్రావుగారు రామాయణం చెప్పమంటున్నారే అమ్మా" అన్నాడు గణపతి.

గణపతి తల్లి మొహం వికసించింది.

"అట్లాగా? ఆయన, పాపం, పిసినిగొట్టు వెధవకాడు. ఆ లక్ష్మీకాంతం వున్నాడే వాడినోట పుండుపడ. వాడి పేరు చెబితేనే నాకు మండిపోతుంది –" అని ఆవిడ మెటికలు విరవసాగింది.

రాములు నవ్వుతూ, "లక్ష్మీకాంతం డబ్బివ్వలేదురా గణపతీ" అన్నాడు.

"ఇచ్చాడులే, బాకీ తీర్చినట్టు అణా పైసలతోసహా" అన్నాడు గణపతి మొహం మటమటలాడించి.

"అదికాదు, రాములూ, నెలరోజులు పురాణం చెప్పించుకున్న వెధవా, చివరి రోజునన్నా ఇంత భోజనం పెట్టి, పట్టు తాపితాలు కాకపోతే మానె, దోవతులచాపన్నా పెట్టడూ? పురాణం చెప్పినచోట ఇంత సమారాధన చేసుకోకపోతే నెత్తి అడవదూ. ఆరునెలల్లో చూడు, వాడి కొంప కూలకపోతే" అంటూ గణపతి తల్లి శాసించింది.

గణపతి నాతో ఇక మాట్లాడేటట్టు కనబడలేదు. కనీసం నేను పంపిన డబ్బు మాటన్నా ఎత్తుతాడేమో అనుకున్నాను. అదేమీ లేదు. వాడు నేరుగా దొడ్లోకిపోయి కాళ్ళు చేతులు కడుక్కుని, తడి అంగోస్త్రం చుట్టుకుని వంట యింట్లోకి పోయి, మడి బట్ట ధరించి దేవతార్చనలో కూర్చుని కళ్ళు మూశాడు.

"పోదాం రాములూ?" అన్నాను.

"మా యింట్లో భోంచెయ్యవా?" అన్నది గణపతి తల్లి.

"వెళ్ళేలోపుగా వస్తాలే" అన్నాను.

## 6

"ముష్టెత్తుకొని గణపతి తగ్గాడనుకుంటున్నావు. వాడి లెక్కలో చాలా పైకి వచ్చాడు.

"ఇప్పుడు వాడికి డబ్బున్నవాళ్ళ ప్రాపకం ఉంది. ఇన్నాళ్ళూ వాణ్ణి ఉపేక్షించిన కాంగ్రెసువాళ్ళు వాణ్ణిప్పుడు చేరదీశారు. ఈ వూళ్ళో కొత్త ధనికవర్గం ఏర్పడింది – దొంగ వ్యాపారస్తులు, పరిమిట్లవాళ్ళూనూ. వాళ్ళంతా మనవాడికి పోషకులు. నువూ నేను వాడి కిప్పుడొక మనుషులల్లే కనిపించం. వాడిప్పుడు బియ్యం అమ్మీ, డబ్బు వడ్డీలకిచ్చీ, డబ్బున్నవాళ్ళని పొగడీ చక్కగా జరుపుకుంటున్నాడు. భాగ్యవంతుల పెళ్ళాలు వాడి భార్యకి తాము విడిచేసిన ఖరీదైన చీరెలిస్తారు. ఆవిడ కళ్ళకద్దుకుని స్వీకరిస్తుంది. నువూ, నేనూ ఉద్యోగాలు చేస్తున్నామని గణపతి మనని చూసి జాలిపడతాడు. లోపల ఏవగించుకుంటాడు కూడా. మనకన్న డబ్బుండి, మనకు ఉద్యోగాలివ్వగలవాళ్ళు మనకన్న పెద్ద తరగతివాళ్ళని ఒప్పుకోం మనం. వాడు ఒప్పుకుంటాడు. వాళ్ళతో సమంగా తన సాంఘిక, రాజకీయ హక్కులు కావాలని వాడుకోరడు. వాడు పురాణం చెబుతుంటే వినాలి. అందులో కూలిజనాన్నీ, సోషలిస్టులనీ, కమ్యూనిస్టులనీ వాడు తిట్టటం వినితీరాలి. నువ్విదివరలో రాజకీయ పురాణాలు విని ఉండవు. ఫరవాలేదు, తరించాడు" అన్నాడు రాములు.

"అవును, నిలువుగా తరించాడు, అట్టడుగు తాకాడు" అన్నాను.

*మొదటి ముద్రణ: కథాసాగరం సంపుటి, డిసెంబర్ 1954*

*దేశి కవితా మండలి, విజయవాడ*